వీడ్కోలు *

—అత్తలూరి నరసింహారావు

అక్కడ అందమైన కుర్చీలుగాని, వాటిముందు అంతకన్నా అందమయిన టేబుల్స్‌గాని వుండవు. దానికి అందమయిన ద్వారం లేదు. ద్వారానికి అందమయిన తలుపులు లేవు. అక్కడ క్యాష్ బాక్స్ వుండదు. బాక్స్ ముందు బొజ్జపెరిగిన శాస్త్రి వుండడు. 'ఏం కావాలి సార్' అని వినయవిధేయతలతో వ్యాపార సరళితో మనల్ని పలకరించే సర్వేశ్వరులుండరు. శుభ్రమయిన తెల్లని వాష్ బేసిన్‌లుండవు. బేసిన్‌ల దగ్గర అద్దాలుండవు. వాటర్ బాయ్‌లు ఉండరు. స్వీపర్‌లు అసలే వుండరు. అక్కడ మెనూలుండవు. స్టీల్‌గ్లాసులు గాని, గాజుగ్లాసులు గాని, అందమయిన కప్పు సాసర్లు గాని వుండవు. టుడేస్ స్పెషల్ బోర్డు అసలే వుండదు. స్పెషల్ స్వీట్స్‌కి స్పెషల్ గాజు గది వుండదు, లోపల ఎయిర్ కండిషన్డ్ గది వుండదు, అక్కడ తిన్న దానికి కాగితపు బిల్లులుండవు. అక్కడ కుటుంబం మొత్తం కూర్చుని తినటానికి ప్రత్యేకమైన గది వున్నట్టు సూచించే బోర్డు లేదు. అక్కడ రాజకీయ నాయకుల ఫోటోలు గాని, పాపాల ప్రతినిధులు దేవుళ్ళ ఫోటోలు గాని అమర్చి లేవు. నెత్తిమీద ఫాన్‌లుండవు. అది వెంకాయమ్మ హోటలు. హోటలు పేరు సూచించే బోర్డు వుండదు! సదరు వెంకాయమ్మే ఆ హోటలుకు బోర్డు.

"సత్యం, ఈయనకు అరిడ్లీ, నాలుగు వడ సాంబారు తీసుకురా" కేకవేసింది వెంకాయమ్మ. వచ్చిన వ్యక్తి బెదురు బెదురుగా చూస్తున్నాడు. ఆర్డరిచ్చినవి ఎప్పుడు వస్తాయా అని ఆత్రుతతో చూస్తున్నాడు. సత్యం ఇడ్లీలు, వడలు రేకు ప్లేటులో పెట్టి తీసుకు వచ్చి చేతికిచ్చి, అక్కడే తినేసిన రేకు ప్లేటొకటి తీసుకొని పోయాడు. తరు

* [కళాశాల విద్యార్థుల కోసం మేము నిర్వహించిన కథల పోటీ పట్ల కళాశాల విద్యార్థులు మేము ఆశించినంత ఉత్సాహాన్ని కనబరచలేక పోయారు. మాకందిన కొద్ది కథల్లో మేము ప్రకటించిన బహుమతిని అందుకోగల స్థాయి యే కథకూ లేదని మేము భావించాము. పోటీకి వచ్చిన కథల్లో "వీడ్కోలు" అన్న ఈ కథను ప్రచురణకు మాత్రమే అంగీకరించినాము. ఈ కథను రచించిన విద్యార్థి శ్రీ అత్తలూరి నరసింహారావుగారు తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బి. ఏ. తృతీయ చదువుతున్నాడు—సంపాదకుడు]

వాత రేకు గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి, బెంచి కింద కాళ్ళ దగ్గర పెట్టాడు. తింటున్న వ్యక్తి భయం భయంగా వున్నాడు. అతని చేతులు వణుకుతున్నాయి. అతను దారుణమయిన ఆకలితో వున్నాడనటానికి నిదర్శనం అప్పుడే రెండు ఇడ్లీలు, రెండు వడలు తినటం; మంచినీళ్ళ గ్లాసులో వున్న నలకల్నీ, వుల్లిపాయ పొట్టుని లెక్కచేయక గటగటా మంచినీళ్ళు త్రాగటం.

సత్యం మంచి నటుడు. ముఖ్యంగా బహుపాత్రాభినయం బాగా చేస్తాడు. ఉదాహరణకి అతనే సప్లయర్, అతనే క్లీనర్, అతనే ప్రొప్రయిటర్. అప్పుడప్పుడు ముసలి వంటావిడ మంచాన పడితే అతనే హెడ్ కుక్. సన్నగా మగాడిలాగా వుంటాడు. తనే వెంకాయమ్మను వుంచుకున్నానంటాడు. తనే సత్యాన్నుంచుకొన్నానంటుంది వెంకాయమ్మ. వయస్సులో సత్యం చిన్నవాడు. వారిద్దరికి వయసులో రాజీ లేకపోయినా, అనుభవాలను పొందటంలో బాగా రాజీ కుదిరింది. వారిద్దరు ముద్దు ముద్దుగా ఒకరినొకరు 'సత్యం' అని 'వదినా' అని పిలుచుకుంటారు.

వెంకాయమ్మ రుబ్బురోలులా వుంటుంది. కళ్ళు వడల కుండే బెజ్జంలా వుంటాయి. బుగ్గలు ఇడ్లీల్లా వుంటాయి. వీపు రెండు దోసెల వెడల్పు వుంటుంది. కాళ్ళు చేతులు కిట్టెపేళ్ళలా వుంటాయి. చేతివేళ్ళు బజ్జీల్లా వుంటాయి తలకాయ బోండాంలా వుంటుంది. నడుం రుబ్బురోలు పత్రంలా వుంటుంది. తొడలు అరటిస్తంభాల్లా ఉంటాయి. ఆమె జుట్టులో అక్కడక్కడ ముసలి దశను సూచించే లక్షణాలున్నాయి. తల దువ్వుకోటానికి దువ్వెనున్నా టైముగాని, శ్రద్ధగాని లేదు. స్నానానికి నీళ్ళున్నా మార్చడానికి చీర లేదు.

ఎవరో లోపలికి వచ్చి బెంచి మీద కూర్చున్నాడు. అక్కడున్న ఈగలన్నీ ఒక్కసారి ఎగిరిపోయి మరెక్కడో మూగాయి. అతను పైపంచతో ముఖం తుడుచుకుంటూ "మంచి వేడి పెసరట్ ఒకటి పట్రా" అని కాస్త జరిగి కూర్చున్నాడు. బెంచి క్రిందఉన్న గ్లాసు కాలికి తగిలి వున్ననీళ్ళు కింద పోయాయి. ప్రక్కనే చెయ్యికడిగిన ప్లేటుంది. ఒక్కసారి ఈగలు ఎగిరి మళ్ళీ ప్లేటుమీద వాలాయి. "కాళ్ళ క్రింద గ్లాసులు పెడితే ఎలా వెంకాయమ్మా" అని తన పంచెను పైకి తీసుకున్నాడు తడవకుండా. అతను ఇంకాస్త జరిగి కూర్చుందామని బెంచీ వైపు చూశాడు. అక్కడ తడిగా వుందనటానికి నిదర్శనంగా నీళ్ళు చిన్న మడుగులుగా వున్నాయి. బెంచీ మీద ఎంగిలి ఉందనటానికి నిదర్శనంగా అక్కడ ఈగలు ముసిరి ఉన్నాయి. మూలనున్న మంచినీళ్ళ కుండ దగ్గర ఒక కుక్క పడుకునుంది. అక్కడే ఒక రేకుగ్లాసు పడివుంది. కుక్కపిల్ల ఒకటి బెంచీల చుట్టూ తిరుగుతోంది.

"వదినా ఈయన దగ్గర అరవై పైసలు తీసుకో" వెంకాయమ్మకు ఇడ్లీలు వడలు తిన్నతన్ని చూపిస్తూ, పెసరట్ అడిగినాయన చేతికి పెసరట్ ప్లేటు అందించి లోపలి కెళ్ళాడు సత్యం. మామూలుగా వెంకాయమ్మ లోపలి వైపుకు తిరిగి సర్వంత్రో కావలసిన సరుకుల గురించి అడుగుతుంది. పైసలివ్వ వలసినాయన నెమ్మదిగా భయం భయంగా లేచాడు. ధైర్యం తెచ్చుకొని నెమ్మదిగా వెంకాయమ్మ చూడకుండా గబగబా గుమ్మందాటి నడిచిపోయాడు. "వెంకాయమ్మా ఆయన డబ్బులిచ్చాడా?" పెసరట్ తింటున్నతను పెసరట్ తుంచి అల్లం పచ్చడి కద్ది నోట్లో పెట్టుకునడిగాడు. "ఎవడూ" అంటూ తన భారీ శరీరాన్ని వెనక్కి తిప్పిచూసింది. (వెంకాయమ్మకు మర్యాదగా మాట్లాడాలని తెలుసు, కాని మాట్లాడ లేదు.) "వాడే, ఆ వెళ్ళేవాడు" అన్నాడు అప్పుడే అరఫర్లాంగు దూరం వెళ్ళినతన్ని చూపిస్తూ. పైసలు లేని మనిషి చకచకా నడుస్తున్నాడు, అడ్డం వచ్చిన మనుష్ని రాసుకుంటూ వాహనాల్ని తప్పించుకుంటూ. "ఓరి లంజాకొడకా" అంటూ ఆవిడ పరుగు ప్రారంభించింది. (అది వెంకాయమ్మ దృష్టిలో చాలా వేగంగా పరుగెత్తడం. కొందరి దృష్టిలో అది చకచకా నడవటం. వెంకాయమ్మను జీవితంలో మొదటిసారిగా పరుగెత్తించింది ముఖ్యంగా లావయిన తరువాత, ఆ పైసలివ్వవలసిన మనిషి; అతనికి ధన్యవాదాలు.)

"వాణ్ని పట్టుకోండయ్యా, వాణ్ని పట్టుకోండయ్యా దొంగనాబట్టని" అంటూ కేకలేస్తూ పరుగెత్తుతోంది. ఎవరిని పట్టుకోవాలో, ఎవరిని దొంగనా బట్టంటుందో వెళ్ళే జనానికి తెలియక వెళ్ళిపోతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సత్యం వంటావిడను చూస్తూ వుండమని చెప్పి తనూ పరుగెత్తాడు. పైసలు లేని మనిషి పరుగెత్తుతున్నాడు. వెంకాయమ్మ పరుగెత్తుతోంది. సత్యం వెంకాయమ్మను దాటి వేగంగా పరుగెత్తుతున్నాడు. పైసలు లేని మనిషి రోడ్డు వదలి రైలుకట్ట ఎక్కి పట్టాల వెంట పరుగెత్తుతున్నాడు. సత్యం తనూ రైలు పట్టాల వెంట పరుగెత్తు తున్నాడు.

కొద్ది దూరంలో రైలుస్టేషన్. ప్రక్క కాస్త ఖాళీ స్థలం రైలు కట్టనానుకొని కొంత దూరం వరకు వుంది. ఆ ఖాళీ స్థలం బారూతా అక్కడక్కడ పడిపోయిన ప్రహరీ గోడవుంది. ఆ గోడమీద ఏదేదో ఎప్పటినుంచో వ్రాసిన ఫలానాది మాత్రమే వాడండి అనే వ్యాపార ప్రకటనలు, ఫలానా వారికి ఫలానా గుర్తుమీదే ముద్రించి దయచేసి గెలిపించవలసినదిగ ఎలక్షను ప్రకటనలు, "తుపాకీ గొట్టం ద్వారానే రాజకీయాధికారం వస్తుంది", "తెలంగాణా విప్లవం వర్ధిల్లాలి" అనే చైతన్య రాజకీయ నినాదాలు వ్రాసివున్నాయి. (ఎవరో దుండగులు తుపాకీలోని 'తు' తెలంగాణాలోని 'తె' 'ణా'లు కావాలని చెరిపేశారు.) వర్షానికి ఆ గోడ బాగా నాని ఉంది. దిక్కులేని వాళ్ళు బల్షో

సుల జీవిత పోరాటంలో నలిగిపోయినట్టు, ఆ గోడనుంచి అప్పుడప్పుడు రాళ్ళు క్రింద పడి నలిగిపోతాయి. ప్రహరీగోడ ప్రక్కనే రోడ్డు, రోడ్డుప్రక్కనే కొందరికి మాత్రమే ప్రవేశంగల పెద్ద హోటలు ఉన్నాయి. ఎంగిలిస్తరాకుల్లోని మిగిలిన అన్నాన్ని ఆత్రుతగా ప్రోగుచేసుకుంటున్నారు ఆ ఖాళీస్థలంలో యవ్వన దశలోకి వస్తున్న ముగ్గురు అభాగ్య జీవులు. హోటల్లో బాగావున్నవారు బాగా భోంచేసిన తరువాత, వారు అతి కరుణార్ద్రహృదయాలతో విస్తర్లో మిగిల్చిన హీనమైన ఖరీదైన కూడును, అతి వినయంగా యూనిఫారం సర్వర్లు ప్లాస్టిక్ బుట్టలతో ఆ ఖాళీస్థలంలో పారవేస్తుంటారు. (అది వాళ్ళ ఖర్మ అని కొందరు వక్రభాష్యం చెబుతారు).

ృ సమాజ సభ్యుడైన ముగ్గురిలో ఒకతను నిక్కరు, బనియను వేసుకున్నాడు. నిక్కరు వెనక భాగం అరిగిపోయి చినిగిపోయింది. బనియనుకి ముందు భాగంలో అభిమాన సినీ నాయకుని ఫోటో రంగుతో అచ్చువేసి ఉంది. దుమ్ముకి ఆ మనిషన్నా, అతని నిక్కరన్నా, బనియనన్నా మహా ప్రేమ ఉన్నట్టు దట్టంగా పట్టివుంది. మరొకడికి చొక్కా మాత్రమే ఉంది. దానికి గుండీలు లేవు. కనబడుతున్న ఎముకల్ని ఒకట్లు నేర్చుకున్న స్కూలు కుర్రాడు తప్పులేకుండా లెక్కపెట్టగలడు. చొక్కాకి ఒక జేబు మాత్రమేవుంది. ఆ జేబు కూడా సగభాగం చిరిగి క్రిందకు వ్రేలాడుతోంది. ఇంకొకడు ఎవరో, ఎప్పుడో ఇచ్చిన, లూజుగా బారుగావున్న పాంటు వేసుకున్నాడు. బారుగా వున్న పాంటుని తనకు సరిపడేంతవరకు మడతలు వేసాడు. మోకాలి దగ్గర పాంటు చినిగివుంది.

గుర్ గుర్ మంటూ అప్పుడే ఒక పంది శరీరానికి మట్టికొట్టుకొని, మూతికి పెంట రాసుకొని వచ్చింది. అంతకుముందే అక్కడున్న కుక్క దానిని చూసి కాస్త ప్రక్కకు జరిగింది. ఈ రెంటినీ చూసి ఒక ఆవు వచ్చింది. వీటన్నింటినీ చూసి కుర్రాళ్ళు కలిసి ప్రోగుచేసుకున్న అన్నాన్ని కాస్త దూరంగా తెచ్చుకొని పెట్టుకున్నారు. వొకడు పాత డబ్బా పట్టుకొని వీధి కుళాయి దగ్గరకు వెళ్ళాడు. మిగిలిన ఇద్దరూ తదేకంగా, అమాయకంగా వొకే దృశ్యాన్ని చూస్తున్నారు. ఎంగిలిస్తరాకుల మీదపడి మేస్తున్న వాటిని మరీమరీ తమ నిశితమైన చూపులతో చూస్తున్నారు.

వాళ్ళు కలిసి ప్రోగుచేసిన మిగిలిన అన్నం దేశానికి మిగిలిన అప్పులాఉంది. కాస్మోపాలిటన్‌లా, క్రాసింగ్ ది ఫ్లోర్‌లా వుంది. (ఆ కుప్పగావున్న అన్నం, మూగగా వొక నగ్న సత్యాన్ని ఆ కుర్రాళ్ళకి మాత్రమే చెబుతుంది—ఆహార సమస్య ఈ ఆర్థిక సామాజిక రాజకీయ వ్యవస్థలో ఛస్తే తీరదని).

'నాకేయ్ ఆడ్ని పట్టుకోండ్రా" "దొంగ" దొంగ" అనే దారుణమైన కేక ఆజ్ఞతో కూడినది వాళ్ళ చెవినిబడి వెనక్కి తిరిగి చూశారు. రైలుపట్టాల వెంట వొకడు పరుగెత్తుకొస్తున్నాడు. వాడు అరవై పైసలు లేని మనిషి. ఆకలితో వున్న మనిషి వెనకాలే మరొకడు అంతకన్నా వేగంగా పరుగెత్తుకొస్తున్నాడు. అతను సత్యం. ఏదో వేళకు కాస్త తిండి వున్న మనిషి. సుదూరంలో వొక లావుపాటి ఆడమనిషి మరికొందరితో కలిసి వేగంగా నడిచి వస్తోంది. ఆవిడ పేరు వెంకాయమ్మ. బోర్డు లేని హోటలుకి ప్రొప్రయిటర్.

తమ వర్గం వాడ్ని, తమలాగా దోపిడీకి గురైన వాడ్ని, తమ వర్గంలోనే దోపిడీకి గురవుతున్న వాళ్ళకు అమాయకులైన ఆ అభాగ్య జీవులు పట్టివ్వటానికి సిద్ధపడ్డారు. (ఇదంతా వాళ్ళకి తెలుసునని మనం అనుకుంటే అది మన తప్పు) వొక్కసారిగా కుర్రాళ్ళు రైలు కట్టమీదకి ఎక్కారు. "అడ్డం వచ్చారంటే చంపేస్తాను రోయ్" పైసలు లేని మనిషి పరుగెత్తుకుంటూ వస్తూ అన్నాడు. కుర్రాళ్ళు కొద్దిగా వెనక్కి తగ్గారు. "నాకేయ్ పట్టుకోండిరా పట్టుకోండిరా" ఆత్రుతతో కూడిన భీకరమైన కేక వెనకాలనుండి వినబడింది. అనాలోచితంగా వెంటనే వొక కుర్రాడు ముందుకురికి దగ్గరకొచ్చిన ఆ లేని మనిషిని గట్టిగా నడుం పట్టుకున్నాడు. వాడు కుర్రాడ్ని వొక్క తోపు తోసి పరుగెత్తుతున్నాడు. కుర్రాడు రైలుకట్ట క్రింద ఖాళీ ప్రదేశంలో పడిపోయాడు. వెంటనే ఇంకొక కుర్రాడు లేని మనిషి కాళ్ళు గట్టిగా పట్టుకొని వదలలేదు. కుర్రాడ్ని ఈడ్చుకుంటూ కొంత దూరం కాస్త తగ్గుస్థాయిలో పరుగెత్తాడు లేని మనిషి. కుర్రాడి మోకాలు రక్తం చిమ్మింది గులకరాళ్ళ రాపిడికి. అంతలో నీళ్ళకెళ్ళిన మూడో కుర్రాడు నీళ్ళడబ్బా అక్కడ పారేసి మొండి ధైర్యంతో ఆ మనిషి నడుముని ఉడుం పట్టు పట్టాడు.

రొప్పుకుంటూ, చెమటలు కక్కుకుంటూ సత్యం పరుగెత్తుకొచ్చాడు. కుర్రాళ్లు లేని మనిషిని వదిలివేసి తమ రక్తానికి ప్రక్కనే వున్న దుమ్మును అడ్డుపెట్టుకుంటున్నారు. సత్యం వాడ్ని కడుపులో వొకతన్ను తన్ని "ఏరా—లంజా—కొడకా—డబ్బు—లివ్వకుండా—పా-రి-పో-తా-వ-ట్రా—నా-కొడకా" అన్నాడు. ఊపిరి వేగంగా లోపలికి బైటికి పీలుస్తూ మళ్ళా బలంగా వొకతన్ను తన్నాడు. అంతలో వెంకాయమ్మ ఇతర మనుషులతో వచ్చింది. చుట్టూ జనం చేరారు. తలా వొక తన్ను తన్నారు 'బాబోయ్', 'అమ్మబాబోయ్', 'కొట్టబాకండి,' 'అయ్యబాబోయ్' తన్నబాకండి 'బాబోయ్', 'అమ్మోయ్' 'కొట్టబాకండి' 'బాబోయ్' 'నాది తప్పే బాబోయ్', 'తప్పేబాబోయ్', 'క్షమించండి', బాబోయ్, అమ్మోయ్, బాబోయ్.

ఒక్కసారి కొట్టే చేతులన్నీ ఆగిపోయాయి, తన్నే కాళ్ళన్నీ ఆగిపోయాయి, తిట్టే నోర్లన్నీ మూసుకున్నాయి.

నిశ్శబ్దానికి కారణం చట్ట రక్షకుడు పోలీసు. రోడ్డుమీద సైకిలికి స్టాండు వేసి వస్తున్నాడు. చేతిలో శనక్కాయల పొట్లంవుంది. దూరంగా పేవ్‌మెంటు మీద శనక్కాయలమ్ముకుంటున్న తాత ఈ పోలీసుని, చేతిలోవున్న పొట్లాన్ని కసిగా చూస్తున్నాడు.

పోలీసు అక్కడి వాళ్ళని "ఏవిటి సంగతి" అని వివరాలు అడుగుతున్నాడు. గుంపులో వాళ్ళు పట్టుబడ్డతన్ని తలా ఒక ప్రశ్న వేస్తున్నారు. వాడి సమాధానం చివర "య్యా", "సామి" అనే పదాలు మాటిమాటికి వస్తున్నాయి. వాడు మొత్తం మీద చెప్పిన సమాధానాల్లోని సారాంశం: పదిరోజుల్నించి అన్నం, ఈయన ముఖం చూడ లేదట. కడుపులో ప్రేగులు ఫిరంగుల్లాగా శబ్దం చేస్తున్నాయట. ఈ పదిరోజుల్లోను అసలు ఎనిమిది పైసల టీలు రెండుసార్లు మాత్రమే త్రాగాడట. మూడోసారి ఎవరో బ్రతిమాలుకొంటే ఒకరే ఇప్పించారట. (అతని భార్యా పిల్లల సమాచారం వాళ్ళు అడగలేదు ఇతను చెప్పలేదు)

"స్టేషన్‌కి అప్పచెప్పండి" అని ఒకరు.

"ఇట్లాంటోళ్ళని ఇరగ దన్నాలి నాయాళ్ళని" అని ఇంకోడు.

'మొన్న బలమయ్యగాడి కొట్లో బీడీ కట్ట పోయింది ఈ వెధవపనేమో చూడండి' అంటూ మరొకడు.

ప్రక్కనున్నతని దగ్గర బీడీ ఒకటి తీసుకొని కాల్చుకుంటున్నాడు పోలీసు. అన్నీ వింటున్నాడు. (చూస్తున్నాడు కూడా)

"అయ్యో నేనెరగను బాబూ", "నన్నొదిలెయ్యండి బాబూ', కూటికి లేక చేశాను బాబూ, నన్నొదిలెయ్యండి బాబూ, "మీ కాళ్ళకి మొక్కుతాను బాబూ", అంటూ లేని మనిషి సత్యం కాళ్ళకి మొక్కటానికి వొంగబోయాడు. సత్యం వెనక్కితగ్గి "థూ—లంజాకొడకా, నాకెందుకురా మా వదిన కాళ్ళ మీదపడు" అంటూ వాడి వెనకాలేవున్న వదిన్ని చూపించాడు. వాడు వెనక్కు తిరిగి వెంకాయమ్మ కాళ్ళు గట్టిగా పట్టుకున్నాడు.

"ఏయ్. ఏం తమాషాగా వుందా. ఆడ్ని తన్నటం, వదిలెయ్యటం, ఏం కథ? ఆ" అంటూ పోలీసు సత్యం వంక చూస్తూ గుంపు మధ్యలోకి వచ్చాడు. పట్టుకున్న కుర్రాళ్ళు చాలా విచిత్రంగా చూస్తున్నారు.

"ఆ ఏవిట్రా నీ పేరు" పోలీసహంకారంతోనే అడిగాడు

"రసూల్" దయనీయంగా చెప్పాడు లేని మనిషి.

"ఓరి సాయిబ్బు నా కొడకా, ఏం రోగం నీకు".

"ఏదో ఆకలేసి తప్పు చేశాను సామీ, ఈ సారికి వదిలెయ్యండి", అతి దీనంగా వేడుకున్నాడు.

"ఆ" అని నిట్టూర్పు విడిచి "ఏయ్ మీరంతా ఎందుకిక్కడ పొండి" అంటూ గర్జించాడు పోలీసు. "ఆ పొండి పొండి" అంటూ సత్యం గుంపుని పంపించేశాడు.

ముగ్గురు కుర్రాళ్ళు తాము వదిలి వచ్చిన అన్నం దగ్గరకు వెళ్ళారు. ఇస్తరాకు ముక్కలు ముక్కలయింది. అక్కడక్కడ అన్నం మెతుకులు దుమ్ములో కలిసి పోయాయి. కనబడుతున్న మెతుకుల్ని ఇంకా కుక్క నాకుతోంది. పంది అక్కడ లేదు. ఆవు దూరంగా వెళ్ళిపోతుంది. మళ్ళా హోటలు వాళ్ళు ఇస్తరాకులు ఇసిరి వేసే వరకు వుండాలి గాబట్టి ఆ కుర్రాళ్ళు మళ్ళా దొంగను పట్టుకున్న చోటకే వచ్చిచేరారు. మిగిలిందల్లా కొద్ది దూరంలో కుర్రాళ్ళ—పోలీసు—వెంకాయమ్మ—సత్యం.

"ఏరా తన్నారా వీడ్ని" సత్యం వైపుకు తిరిగి అడిగాడు పోలీసు.

"అవును సామీ, లంజకొడుకుని చంపేసి వుండేవాళ్ళం మీర్రాకపోతే" అన్నాడు ఉద్రేకంగా సత్యం.

పోలీసు తన పుస్తకంలో ఏదో వ్రాస్తున్నట్టు నటిస్తున్నాడు.

"అయితే స్టేషన్‌కి పదండి అందరూ" పోలీసు తన బండగొంతుతో అన్నాడు.

"మేమెందుకు సామీ" వెంకాయమ్మ సత్యం నోర్లు తెరచుకొని మరల మూసుకున్నాయి.

"ఎందుకేంటి వాడ్ని కొట్టినందుకు" అన్నాడు పోలీసు.

"సామి సామీ! ఏదన్నా ఇచ్చుకుంటాంగాని మమ్మల్ని వదిలెయ్యండి" అంటూ ఇద్దరూ పోలీసు చేతులు పట్టుకున్నారు.

"ఎంతిస్తారేంటి" అంటూ గంభీరంగా ఇద్దరి వంకా చూశాడు.

"వుందంతా యిస్తాను" అంటూ వెంకాయమ్మ తన బొడ్లోవున్న డబ్బులసంచినుండి ఆ రోజు ఆ టైమ్‌కి వచ్చిన రెండురూపాయలని పోలీసు చేతిలో పెట్టింది. రోడ్డునలంక చూస్తూ అవి తీసుకొని టోపీతీసి చేతిలోవి తలమీద పెట్టుకొని మళ్ళా టోపీ పెట్టుకున్నాడు.

"స్టేషన్‌కి రండి కేసు రాసుకున్న తరవాత మీరు పోదురుగాని. ఆ పదరా స్టేషన్‌కి" అంటూ బయలుదేరాడు పోలీసు స్టేషన్‌కి. అవినీతి వెంట అజ్ఞానం, అమా

యకత్వం వెళ్తున్నట్టు పోలీసు వెంట వాళ్ళు ముగ్గురూ వెళ్తున్నారు.

ఆ పాడుబడిన, నాచిన, ప్రహరీగోడ దగ్గర పెళ్ళేసరికి ఒక రాయి క్రింద పడింది. ముగ్గురూ ఆ గోడవైపే తదేకంగా చూస్తున్నారు. అస్పష్టంగా ఏదో ఆ గోడ మీద ఎర్రటి అక్షరాలతో వ్రాసివుంది. వాళ్ళు చూస్తున్నారు. కాని అది చదవలేదు. అది అర్థంగాలేదు. "ఆకలితో చచ్చేకన్నా పోరాటంలో మరణించడం మేలు" ఈ మాటలే ఆ గోడమీద వున్నవి.

అభ్యుదయ పథంలో ఆంధ్ర ప్రదేశ్

భారత దేశంలోని రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ అక్షర క్రమంలో మొదటిది.

అలాగే అనేక అభివృద్ధి రంగాలలో కూడా ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా వుంది.

భాషా ప్రాతిపదికతో ఏర్పడిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే.

పంచాయతీ రాజ్య వ్యవస్థకు తొలి రూపు రేఖలు దిద్దిన ఘనతకూడా ఆంధ్ర ప్రదేశ్‌దే.

దేశం మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణంలో అయిదవది, జనాభాలో నాల్గవది.

కృష్ణా గోదావరి జీవనది జలాలూ, అపారమైన ఖనిజసంపదా కలిగిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడి పదమూడేండ్లు అయింది.

ఆంధ్ర ప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయ రాష్ట్రం.

భవిష్యత్తుమీద ప్రగాఢమైన విశ్వాసంతో పరిశ్రమల రంగంలో కూడా ఆంధ్ర ప్రదేశ్ ముందంజ వేస్తున్నది.

హైదరాబాదు నగరమూ, పరిసర ప్రాంతాలు, విశాఖపట్నం, రామగుండం, కొత్తగూడెం ప్రాంతాలలోని పారిశ్రామిక వాతావరణం కొత్త కొత్త పరిశ్రమలకు ఆకర్షణీయంగా అభివృద్ధి చెందుతున్నది.

విదేశీయుల పరిపాలనలో తెలుగు ప్రజల ఐక్యత విచ్ఛిన్నమైంది.

ఒకే భాష, ఒకే లక్ష్యం, ఒకే భవితవ్యం—అనే ఆదర్శాలు నాలుగుకోట్ల తెలుగు ప్రజల విస్తృత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఐక్యంగా వుండడం శ్రేయస్కర మని ఉద్బోధిస్తున్నాయి.

రాష్ట్రంలో లభించే వనరులను ఎక్కువగా ఉపయోగించుకోడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజలు వారి ప్రయోజనాలను సమంగా పొందటానికి, ఒకరికొకరు చేదోడు వాదోడుగా సమన్వయ పూర్వకమైన అభివృద్ధి సాధించడానికి—అన్ని ప్రాంతాలు ఐక్యంగా వుండడం అవసరం.